ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 20 | మార్చి | 2024
పేజీలు 7

## ఎన్నికల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలి




2లో

# హస్తం కోసం పోటా పోటీ




### - కమలం ఆయనకేనట
### - ఖమ్మం పార్లమెంటుపై పలువురి గురి
### - నిస్తేజంలోనే బిఆర్ఎస్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్రంలోనే ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిత్వం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు టికెట్ ఆశిస్తుండడం అందరు ఏదో ఒక రకంగా ప్రముఖులే కావడం ఇందుకు కారణం. మారిన ప్రత్యేక పరిస్థితుల్లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వం ఖరారు చేసుకుంటే గెలుపు నల్లేరు మీద నడకే అన్న భావన ఉండడంతో తీవ్ర పోటీ ఏర్పడింది. జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల కుటుంబ సభ్యులు పార్లమెంటు రేసులో ఉండడంతో మరింత ఆసక్తిగా మారింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి, పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజక వర్గాలలో తొలి దశ ప్రచారాన్ని పూర్తి చేశాడు. టికెట్ తప్పక తమకే వస్తుందన్న భావనలో ఒక అడుగు ముందే ఉన్నాడు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి నందిని కూడా ఎంపి టికెట్ ఆశిస్తున్నారు. ఖమ్మం, మధిర, వైరా తదితర నియోజక వర్గాలలో పార్టీ క్యాడర్‌ను కలుస్తూ కాంగ్రెస్ పార్టీ తమకే అవకాశం కల్పిస్తుందని కార్యకర్తలకు భరోసా ఇస్తున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు యుగంధర్ సైతం టికెట్ ఆశించడమే కాదు అందుకు

మిగతా 2లో..

## ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో
# భారీ ఎన్‌కౌంటర్

## నలుగురు మావోయిస్టులు మృతి



- మృతులు తెలంగాణ మావోయిస్టు నేతలు
- అందులో ఇద్దరు అగ్రనేతలు, వారిపై 36 లక్షల రివార్డు
- కొనసాగుతున్న ఎదురు కాల్పులు
- లోక్‌సభ ఎన్నికల వేళ ఉలిక్కిపడ్డ ఏజెన్సీ
- ఐదు రాష్ట్రాల సరిహద్దుల్లో హై అలెర్ట్

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ మహారాష్ట్ర సరిహద్దులు రక్తసిక్తమయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతి చెందిన మావోయిస్టు నేతలు వర్గీస్, మర్గాతు, రాజు, వెంటేష్‌లు తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్టు నేతలుగా పోలీసులు తెలిపారు. వీరిపై రూ.36 లక్షల రివార్డు కూడా ఉంది. తప్పించుకుని అడవుల్లోనికి జారుకున్న మావోయిస్టుల కోసం కోసం

మిగతా 2లో..

## కళ తప్పిన ప్రకృతి వనాలు



### -ఎండిపోతున్న మొక్కలు
### -పట్టించుకోని పంచాయితీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గత ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను పెంచేందుకు అధిక ప్రాధాన్యతనిచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది రూపాయలను పల్లె ప్రకృతి వనాల కోసం వెచ్చించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, పంచాయితీ సర్పంచుల పదవి కాలం ముగియడంతో పల్లె ప్రకృతి వనాలు కళ తప్పుతున్నాయి. గ్రామ పంచాయితీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారులు పల్లె ప్రకృతి వనాల గురించి పట్టించుకోకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కలు ఎండిపోతున్నా అధికారులు ఆ వైపుకు కన్నెత్తి చూడడం లేదు. వేలాది రూపాయలు ఖర్చు చేసి పల్లె ప్రకృతి వనాలలో మొక్కల పెంపకానికి నీటి కోసం బోర్లు వేశారు. కొన్ని చోట్ల బోర్లు ఎండిపోగా మరికొన్ని చోట్ల అలసత్వం మొక్కలు ఎండిపోవడానికి కారణమవుతుంది. ఒక్కో ప్రకృతి వనానికి రూ. 10 లక్షలకు పైగా ఖర్చు చేశారు. ఫెన్సింగ్ వేసినా ఉపయోగం లేకుండాపోయింది. పల్లె ప్రకృతి వనాలతో పాటే క్రీడా ప్రాంగణాలను కూడా ఏర్పాటు చేశారు. వీటి కోసం చేసిన ఖర్చు వృథా అయిపోయింది. క్రీడాకారులకు ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా తగు పరిశీలన చేసి పల్లె ప్రకృతి వనాలలో మొక్కలను కాపాడి పచ్చదనం పెంచాలని కోరుతున్నారు.

## ఎన్నికల నిర్వహణ

# సమర్థవంతంగా చేపట్టాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల నిర్వహణలో ఏ దశలోను లోపాలు లేకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తో కలిసి జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ఏఆర్‌వో, డిఎస్‌పి, ఏసిపి, నోడల్ అధికారులతో లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విధులు చాలా కీలకమైనవని ఎక్కడ ఏ చిన్న తప్పిదానికి తావివ్వకుండా వంద శాతం సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. శనివారం ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ఏప్రిల్ 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 26న స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు అభ్యర్థుల ఉపసంహరణకు గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ నాలుగున లెక్కింపు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి బృందాలను పూర్తి స్థాయిలో పనిచేసేలా చూడాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు వాహనాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నిఘా బృందాలు తమకు కేటాయించిన ప్రదేశాలలో విధుల నిర్వహణ చేయాలన్నారు. అసెంబ్లీ నియోజక వర్గాల వారీగా కేటాయించిన బృందాలు ఏ ప్రదేశాలలో ఏర్పాటు చేసింది అడిగి తెలుసుకున్నారు. ఏఆర్‌వోలు నిఘా బృందాల పర్యవేక్షణ చేయాలన్నారు. క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల గుర్తింపు పూర్తి చేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం లోపల సిసి కెమెరాల ఏర్పాటు వంద శాతం ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్‌ల నివేదిక మేరకు పోలింగ్ కేంద్రాల వెలుపల సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఏఆర్‌వోలు, పోలీస్ అధికారులు తమ పరిధిలోని ప్రతి ఒక్క పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల పరంగా, భద్రతాపరంగా చేపట్టాల్సిన చర్యల గురించి కార్యచరణ చేయాలన్నారు. సువిధ సింగిల్ విండో ద్వారా అనుమతులు జారీ చేయాలని, నిర్ణీత కాల వ్యవధిలోగా అనుమతులు జారీ అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. రవాణా కార్యచరణ పకడ్బందీగా చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు ఆయా సెగ్మెంట్ల పరిధిలోను, రిసెప్షన్ కేంద్రం ఒకే చోట లెక్కింపు కేంద్రం వద్ద ఏర్పాటు చేయాలన్నారు. లెక్కింపు కేంద్రాన్ని సందర్శించి రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూము ఏర్పాట్లు చూసుకోవాలన్నారు. ఎన్నికల పరిశీలకుల సందర్శనలోగా లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సివిజిల్ పై అవగాహన విస్తృతం చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమావేశాలు నిర్వహించి సివిజిల్ యాప్ పై అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఒక సెక్టార్‌లో గరిష్టంగా 12 పోలింగ్ కేంద్రాలు ఉండేవిధంగా, మరో 10 అదనపు సెక్టార్లు ఏర్పాటు చేశామన్నారు. ఒక పోలింగ్ కేంద్రం ఒకటి కంటే ఎక్కువ సెక్టార్లలో ఉండకుండా చూడాలన్నారు. 85 ఏళ్లు పైబడిన వారికి, దివ్యాంగులకు హోం ఓటింగ్ నిమిత్తం ఫారం 12 డిలను ఇంటింటికి అందజేయాలన్నారు. సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్, ప్రలోభాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు.

జిల్లాలో 12 ఎఫ్ఎస్‌టి, 15 ఎస్ఎస్‌టి, రెండు ఇంటిగ్రేటెడ్ ఇంటర్ చెక్‌పోస్టులు, ఎనిమిది ఇంటర్ డిస్ట్రిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 24గంటలు నిఘా ఉంచినట్లు తెలిపారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రజలతో మర్యాదగా మెలగాలన్నారు. అనుమతి, రవాణా పట్ల చర్యలు తీసుకోవాలన్నారు. ప్రచార సామాగ్రిపై ప్రచురణ కర్త పేరు, వివరాలు లేకుంటే సీజ్ చేయాలన్నారు. సీజర్‌కు 102 కూడా ఉపయోగించాలన్నారు. సీజర్ సమయంలో అన్ని నిబంధనలను పాటించాలన్నారు. క్రిటికల్, వల్నరబుల్, పోలింగ్ కేంద్రాల గుర్తింపు మార్గదర్శకాల మేరకు చేపట్టాలన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజు, శిక్షణ ఐపిఎస్ మౌనిక, అదనపు డిసిపి ప్రసాదరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, ఖమ్మం, కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు గణేష్, శ్రీనివాస్, మధు, డిసివో మురళీధర్‌రావు, ఐటి అధికారి సాయికుమార్, జిల్లా శిక్షణ నోడల్ అధికారి కె. శ్రీరాం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హస్తం కోసం పోటా పోటీ



(మొదటిపేజీ తరువాయి)

అనుగుణంగా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. కుల సమీకరణ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో తమకే అవకాశం దక్కుతుందన్న భావనలో యుగంధర్ ఉన్నారు. వీరితో పాటు పారిశ్రామిక వేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ (రాజా), జెట్టి కుసుమకుమార్, ఎన్‌టివి అధినేత నరేంద్ర చౌదరి పేర్లు కూడా వినపడుతున్నాయి. కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి. హన్మంతరావు సైతం ఖమ్మం టికెట్ ఆశిస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానానికి ఖమ్మం అభ్యర్థి ఎంపిక ఇబ్బందికరంగానే మారింది. అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థి కోసం అధినాయకత్వం దృష్టిసారించినట్లు సమాచారం. నోటిఫికేషన్‌కు చాలా సమయం ఉండడంతో ఇప్పట్లో అభ్యర్థి ఎంపిక వ్యవహారం తేలకపోవచ్చు. బిఆర్ఎస్ తమ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావును రంగంలోకి దించింది. నామ పార్లమెంటుకు పోటీ చేయడం ఇది ఐదవ సారి. బిఆర్ఎస్ అభ్యర్థిత్వం ముందే ఖరారైన పార్టీలో అంత జోష్ కనిపించడం లేదు. ఏదో ఆశించి అవకాశవాదంతో బిఆర్ఎస్‌లో చేరిన వారంతా తిరుగుముఖం పట్టారు. ఒక్కొక్కరు ఒక్కొక్కరుగా కారు దిగుతుంటే నైరాశ్యం నెలకొంది. క్యాడర్‌లో పెద్ద మార్పు లేకపోయినా నాయకత్వం చేజారిపోతున్నారు. ఓ సమావేశం మినహా ఆ పార్టీ కార్యక్రమాలు ఏమి లేవు. కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక పై బిఆర్ఎస్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది. కమలం గుర్తు కోసం పోటీపడుతున్నారు. ఇటీవల బిజెపిలో చేరిన జలగం వెంకట్రావుకే పోటీ చేసే అవకాశం దక్కుతుందని ప్రచారం జరుగుతుంది. వెంకట్రావు కంటే బలమైన అభ్యర్థి బిజెపికి దొరకకపోవచ్చు.ఖమ్మం పార్లమెంటు పరిధిలో వామపక్షాలకు గణనీయమైన బలం ఉంది. వామపక్షాల నిర్ణయం కూడా కొంత మేర ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇంకా పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి నిర్ణయం వెలువడలేదు. సిపిఐ మాత్రం ఖమ్మం, పెద్దపల్లి, నల్గొండ, భువనగిరి, వరంగల్ లలో ఒక స్థానాన్ని ఆశిస్తుండడగా సిపిఎం రెండు స్థానాలలో పోటీ చేయనున్నట్లు తెలిపిన తుది నిర్ణయం జరగలేదు.

# ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

సిఆర్‌పిఎఫ్, మహారాష్ట్ర,ఛత్తీస్‌గఢ్ పోలీసు బలగాలు ముమ్మర గాలింపు చేపట్టారు. మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో గల కూలమార్కో గుట్టల్లో మహారాష్ట్రఛత్తీస్‌గఢ్ తెలంగాణఆంధ్రప్రదేశ్ఒడిస్సా రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు అగ్రనేతలతో పాటు దళం సమావేశమైనట్లు సమాచారాన్ని అందుకున్న 36 సిఆర్‌పిఎఫ్ బలగాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసులు సంయుక్తంగా గుట్టలను చుట్టుముట్టాయి. సమాచారం ఏర్పాటు చేసుకున్న ప్రాంతానికి బలగాలు చేరుకోవడంతో పసిగట్టిన మావోయిస్టులు ఒక్క సారిగా పోలీసులపై కాల్పులకు తెగబడ్డారు. దీంతో పోలీసు బలగాలు ఆత్మరక్షణ కోసం ఎదురుకాల్పులకు దిగాయి. ఇరు వర్గాల మధ్య సుమారు రెండు గంటల పాటు హోరాహోరీన ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. పోలీసుల తూటాల ధాటికి తాళలేని మావోయిస్టు పార్టీ సమీప అడవుల్లోనికి క్రమంగా జరుకున్నాయి. అటువైపు నుండి కాల్పులు ఆగిపోవడం, అడవుల్లోనికి జారుకున్నట్లు నిర్ధారించుకున్న తర్వాత సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. అక్కడ నాలుగు మృతదేహాలు పడి ఉండటంతో పాటు పాటు ఏకే 47 1, పిస్టళ్లు 2, మందుగుండు సామాగ్రి విప్లవ సాహిత్యంతో పాటు వంటపాత్రలు లభ్యమయ్యాయి.



**మృతులు తెలంగాణ మావోయిస్టు పార్టీ నేతలు...**

మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్ సందర్భంగా గుట్టల్లో మృతి చెందిన నలుగురు మావోయిస్టులు తెలంగాణ ప్రాంతానికి చెందిన వారిగా మహారాష్ట్ర పోలీసులు గుర్తించారు. ఇందులో కొమరంబీం, మంచిర్యాల ఏరియా కార్యదర్శి, డివిసి సభ్యులు వర్గీస్, ఇంద్రవెల్లి ఏరియా కార్యదర్శి, డివిసి సభ్యులు మర్గాతు, కమిటీ సభ్యులు రాజు, వెంకటేష్ ఉన్నారు. వర్గీస్, మర్కాతు మావోయిస్టు అగ్రనేతలుగా, వీరిపై రూ.36లక్షల రివార్డు ఉన్నట్లు, ఇరువురిపై మహారాష్ట్రంతోపాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్లు మహారాష్ట్ర పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలం నుండి అడవుల్లోనికి జారుకున్న మావోయిస్టుల కోసం బలగాలు సంయుక్త ఆపరేషన్ ముమ్మరం చేశాయి. ఆపరేషన్ పహార్‌లో భాగంగా అత్యాధునిక ఆయుధాలు ఉన్న సిఆర్‌పిఎఫ్ బలగాలు మావోయిస్టుల ఏరివేసేందుకు కూంబింగ్‌లు చేపడుతున్నారు.

**ఉలిక్కిపడ్డ ఏజెన్సీ...**

లోక్‌సభతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌తో ఏజెన్సీ ఒక్క సారిగా ఉలిక్కిపడింది. మహారాష్ట్ర సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని కూలామార్కో గుట్టల్లో ఐదు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు అగ్రనేతలు సమావేశం ఏర్పాటు చేసుకున్న వేళ చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్ ఆయా రాష్ట్రాలతో పాటు ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ఆయా ప్రభుత్వాలు నిఘా పెంచాయి. సరిగ్గా ఎన్నికల కోడ్ అమలవుతుండగా ఎన్‌కౌంటర్ జరగడంతో ఐదు రాష్ట్రాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. ఏ క్షణం ఏం జరుగుతుందో అంతుపట్టని పరిస్థితి నెలకొంది. అటవీ గ్రామాల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ప్రధానంగా అడవుల్లో నుండి తప్పించుకున్న మావోయిస్టు నేతలు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ప్రాంతాల్లో తలదాచుకుని ఉంటారనే ఉద్దేశ్యంతో ముమ్మర సోదాలు చేస్తున్నారు.

**ఐదు రాష్ట్రాల్లో హై అలెర్ట్ ...**

ఎన్‌కౌంటర్ జరిగి, నలుగురు మావోయిస్టులు మృతి చెందడంతో ఐదు రాష్ట్రాల్లో హై అలెర్ట్ ప్రకటించారు. అంతరాష్ట్ర సరిహద్దులను తమ ఆదీనంలోనికి తీసుకున్న పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మావోయిస్టులకు ఆశ్రయం కల్పించే గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టి మావోయిస్టు పార్టీకి సహకరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి చెందడంతో ఉత్కంఠ పరిస్థితుల్లో సరిహద్దు రాష్ట్రాల్లో ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి.

# కార్మికవర్గ పక్షపాతి మేకల సంగయ్య




## -ఆశయసాధనకు నిరంతర కృషి
## -వర్ధంతి సభలో బాగం హేమంతరావు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించిన మేకల సంగయ్య అనేక కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించి కార్మిక వర్గ పక్షపాతిగా నిలిచారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. మారిన రాజకీయ పరిస్థితులలో కమ్యూనిస్టు పార్టీకి అంకితమై తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడన ప్రజా సమస్యల పరిష్కారం పట్ల కృషి చేశారన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు మేకల సంగయ్య ఎనిమిదవ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ యుక్త వయస్సులో సాయుధ పోరాటం వైపు ఆకర్షితుడైన సంగయ్య ఆ తర్వాత సిపిఐ పక్షాన అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. పార్టీ ఏ కార్యక్రమాన్ని అప్పగించిన విజయవంతంగా పూర్తి చేసిన సంగయ్య ఇల్లందు ప్రాంతంలో చారిత్రాత్మక భూ పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. జిల్లా కేంద్రంలో ఉండి పలు కార్మిక సంఘాలను ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘ కాలం పనిచేసిన సంగయ్య ఉమ్మడి ఖమ్మంజిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికుల పోరాటాలకు నాయకత్వం వహించి సంఘాల సంగయ్యగా పేరు తెచ్చుకున్నారని హేమంతరావు తెలిపారు. సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శిగా పనిచేసిన సంగయ్య పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. దేశంలో ఒక ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయని మతోన్మాదం దేశాన్ని భయపెడుతున్నా యన్నారు. మెజార్టీ మతంలో ఉన్మాదం రగిలితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని ఆయన తెలిపారు. కమ్యూనిస్టు ఉద్యమం వైపు మరింత మందిని ఆకర్శించడం ద్వారా ఉన్మాదాన్ని నిలువరించాలని హేమంతరావు పిలుపునిచ్చారు. సంగయ్య ఆశయ సాధన కోసం పని చేయడమే ఆయనకిచ్చే సరైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, మేకల శ్రీనివాసరావు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, పగిడిపల్లి ఏసు, నానబాల రామకృష్ణ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, బోడా వీరన్న, ఎస్‌కె సైదా, శ్రావణ్, మందా వెంకటేశ్వర్లు, పోటు పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ రిఫరీగా మోహన్




ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఈనెల 23 నుంచి 27 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న 45వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలలో రిఫరీగా ఎర్రుపాలెం మండలానికి చెందిన వరికూటి మోహన్ వ్యవహరించనున్నారు. దీనికి సంబంధించి హ్యాండ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ, తెలంగాణ స్టేట్ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శ్యామల పవన్‌కుమార్ , తెలంగాణ రాష్ట్ర రిఫరీ బోర్డు ఛైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఇట్టి విషయాన్ని తెలిపారు. గత 20 ఏళ్లుగా పలు జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా, జాతీయ స్థాయి పోలీస్ క్రీడల్లో న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన వరికూటి మోహన్ ఎన్నో ఉత్తమ అవార్డులను పొందారు. జాతీయ స్థాయి పోటీలకు రిఫరీగా ఎంపికైన మోహన్‌ను ఖమ్మంజిల్లా సీనియర్ క్రీడాకారులు, అసోసియేషన్ సంఘాలు, పేబ్యాక్ సొసైటీ సభ్యులు జంగా లక్ష్మణ్‌రావు, కనకయ్య, జైపాల్, శ్రీనివాసరావు, జర్నలిస్టు వేణుగోపాలరావు, గ్రామస్తులు తదితరులు అభినందనలు తెలిపారు.

# మహ్మద్ జావిద్‌కు సముచిత స్థానం కల్పించాలి



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మంజిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమించిన ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ జావిద్‌కు సముచిత స్థానం కల్పించాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌ను కలిసి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. ఖమ్మంజిల్లాలో కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారిలో మహ్మద్ జావిద్ ఒకరని వారికి ఇటీవల ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో పదవి రాకపోవడం బాధాకరమన్నారు. మహ్మద్ జావిద్ ఎంఎల్‌వి టికెట్ ఆశించినప్పటికీ అప్పటి పరిస్థితులకు అనుగుణంగా సర్దిచెప్పారన్నారు. టికెట్ దక్కకపోయినప్పటికీ పార్టీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన జావిద్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పించి పదవి అప్పగించాలని ఎన్ఎస్‌యుఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు కందుల రాజా, అర్జున్, రెంటాల బాలాజీ, మారోజు హరీష్, వెంకన్న, భద్రు తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు చెల్లించకపోతే 22 నుంచి నిరవధిక సమ్మె



## ఏఐటియుసి ఆధ్వర్యంలో వినతి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను, పిఆర్‌సి బకాయిలను వెంటనే చెల్లించాలని లేనిపక్షంలో ఈనెల 22 నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు ఏఐటియుసి ఖమ్మంజిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో సమ్మె నోటీసును డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వోకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎం నందు పనిచేస్తున్న ఉద్యోగుల వేతనాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు వచ్చే జీతాలతో పోలిస్తే వీరి జీతం మూడో వంతు కూడా లేదన్నారు. జీతాలను కూడా మూడు నెలల పాటు ఇవ్వకుండా ఉంటే వారి కుటుంబాలు ఏవిధంగా జీవనం సాగిస్తాయని తెలిపారు. జీతాలు చెల్లించని కారణంగా ఎన్‌హెచ్‌ఎంలు పండుగలు కూడా జరుపుకునే పరిస్థితి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ఎన్‌హెచ్‌ఎం విభాగానికి చెల్లించాల్సిన రూ. 380 కోట్లను వెంటనే విడుదల చేయాలన్నారు. బడ్జెట్‌తో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతభత్యాలు చెల్లించాలని, పెండింగ్ జీతాల చెల్లింపు, పిఆర్‌సి బకాయిలను ఈనెల 21 లోగా చెల్లించాలని లేని పక్షంలో ఈనెల 22 నుంచి ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, డిపివో వి. నిలోహాన, రెండవ ఏఎన్ఎం నాయకులు భవాని, చంద్రమణి, రాజేశ్వరి, నాగరాజు, కృష్ణ మోహన్, సంతోషి, రాజేష్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నాయకుడు ఎర్రయ్య మృతి





ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలోని రామన్నపేట 60వ డివిజన్‌కు చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గుడవర్తి ఎర్రయ్య(76) అనారోగ్యంతో ఇంటివద్ద మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నరసింహారావు, జిల్లా సమితి సభ్యుడు బోజ్జేడ్ల సూర్యం, మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు..ఈ ప్రాంతంలో సిపిఐ పార్టీ ఎదుగుదలకు ఆయన చేసిన కృషిని కొనయాడారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా వెరవకుండా పార్టీకి అండగా నిలిచాడన్నారు. అటువంటి వ్యక్తిని కోల్పోవడం పార్టీకి తీరని లోటన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుదన్నారు. మృతునికి భార్య,ముగ్గురు కుమారులు ఉండగా..వారందరూ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ నాయకులు పిట్ల కృష్ణమూర్తి, నూనె శశిధర్, బోడా వీరన్న, టి.కృష్ణారావు, ఆరెంపుల కొరివి, భూక్యా భాగ్య, కాంగ్రెస్ నాయకులు రమేష్, సిపిఐగ్రామశాఖ సభ్యులు ఉన్నారు.

## నేడు జిల్లా పరిషత్‌స్థాయి సంఘాల సమాశం

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నారు. గ్రామీణాభివృద్ధి స్థాయి కమిటీ సమావేశం ఉ.10 గం.లకు, విద్య, వైద్య కమిటీ సమావేశం ఉ.11 గం.లకు, మహిళా సంక్షేమ కమిటీ సమావేశం ఉ.11.30 గం.లకు , వ్యవసాయ స్థాయి కమిటీ సమావేశం మ.12.15 గం.లకు, పశుల స్థాయి సమావేశం మ.2.30 గం.లకు, సాంఘిక సంక్షేమ స్థాయి కమిటీ సమావేశం మ.2.30గం.లకు, ప్రణాళికా, ఆర్థిస్థాయి కమిటీ సమావేశం మ.3.30 గం.లకు నిర్వహిస్తారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు, గౌరవ శాశ్వత ఆహ్వానితులు, సంబంధిత జిల్లా అధికారులు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే వారికి జిల్లా పరిషత్ నుండి సమాచారాన్ని అందజేశారు.

# గ్రంథాలయానికి ఇన్వర్టర్ వితరణ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లా గ్రంథాలయ సంస్థకు ఆర్యవైశ్యమహాసభ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు మంగళవారం ఇన్వర్టర్ వితరణగా అందజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నేటి పోటీ పరీక్షల కాలంలో విద్యుత్ అంతరాయం వాటిల్లకుండా ఉండేందుకు ఈ వితరణ అందించినట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలని, నేటి పోటీ ప్రపంచంలో అవకాశాలు అందిపుచ్చుకున్న వారే గొప్పవారని అన్నారు. చదువులకు మంచిన సంపద లేదని, తెలివిని ఎవ్వరూ దొంగిలించలేరని, సరస్వతి కటాక్షాన్ని పొందిన వారు ఉన్నత స్థానాల్లో నిలుస్తారని, నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకురాళ్లు డి వరలక్ష్మీ దేవి, జి మణిమృదుల, ఆఫీస్ ఇంచార్జ్ వనీష్ కుమార్, ధారా రమేష్, కొయ్యాడ నగేష్, నరేంద్రుల రుషికుమార్, జూలూరి ఆనంద్, డివిఎస్‌కే బాబు, గణేష్, కిరణ్, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాల్సిందే..



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఎన్నికల నిబంధనలు వ్యాపారులు ఖచ్చితంగా పాటించాలని నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు అన్నారు. మండలం కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ లో మంగళవారం వివిధ వ్యాపారస్తులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రతీ దుకాణాంలో జరిగే లావాదేవీల పై ఆధారాలు ఉండాలని అన్నారు. ఆన్‌లైన్ బదిలీలు లీగల్ గా ఉండాలని అన్నారు. రూ.50 వేలు దాటితే అందుకు సంబంధించిన బిల్లులను నోడల్ అధికారి కి తెలియజేయాలని అన్నారు. బ్యాంక్‌లో డిపాజిట్లు చేసే సమయంలో ఆదారాలు పక్కాగా ఉండాలని అన్నారు. అదే విధంగా సైడర్ నేరగాళ్ల పట్ల వ్యాపారులు అప్రమతంగా ఉండాలని అన్నారు. ప్రతీ దుకాణంలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎవరైనా అనుమానితంగా కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యాపార సంఘాల ప్రతినిధులు వల్లాల రాధాకృష్ణ, మాటూరి సుబ్రహ్మణ్యం, హనుమంతరావు, దోస పాటి శేఖర్,చవళం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ వాహనాన్ని తనీఖీ చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రతీ వాహనం ను క్షుణ్ణంగా తనీఖీ చేయాలని పాలేరు ప్లయింగ్ స్క్వాడ్ అధికారి వేణుమనోహార్ సూచించారు. మండల కేంద్రంలో పలు వాహానాలను తనీఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ప్రతీ వాహనం ను తనీఖీ చేయాలని అన్నారు. ఎంతటి వారైనా సరే వాహన తనీఖీలు చేయాల్సిందేన్నారు. నగదు, బంగారు అభరణాలు, ఎన్నికల తాయిలాలు తరలిస్తున్నట్లు తెలిస్తే తమకు వెంటనే సమాచారం అందించాలని కోరారు. పాలేరు నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సిబ్బంది అప్రమతంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి సురేందర్‌రెడ్డి, నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు, ఎఏస్సై కోడేత్రాచు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పని చేయించుకుని డబ్బులు ఇవ్వలేదని... అర్ధరాత్రి ఇంటి ముందు ధర్నా



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పని చేయించుకుని ఇవ్వాల్సిన డబ్బులు అడిగితే ఇవ్వకపోవటంతో ఇంటి ముందు అర్ధరాత్రి ధర్నా చేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుడు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండా కు చెందిన భూక్యా రమేష్ అనే వ్యక్తి కి ఉపాధి హామీ పథకం లో పేరు రాకపోవటంతో గ్రామస్తులు పేర్ల మీద పనులు చేస్తారు. కాగా ఒకరి పేరు న పని చేసినందుకు రోజుకు రూ.150 ఇస్తారు. ఇలా గ్రామంలో అనేక మంది పేర్ల మీద పనులు చేస్తున్నారు. కాగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి పని చేయించుకుని డబ్బులు ఇవ్వలేదని అర్ధరాత్రి అతని ఇంటి ముందు ధర్నా నిర్వహించారు. అంతే కాకుండా తనకు అన్యాయం చేశారని 100 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. పోలీసులు బాధితుడు ను ఫోన్ ద్వారా కౌన్సిలింగ్ ఇచ్చి, గ్రామస్తుల ద్వారా ఆందోళన విరమించేలా ప్రయత్నించారు. ఉపాధి హామీ పథకం పనుల పట్ల అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ఈ పథకం నీరు గారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి పనుల పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నిబంధనలు పాటించని పురుగుల మందుల షాపులు..!?

- పురుగు మందులకు అధిక రేట్లు
- కనిపించని బోర్డులు, ధరల పట్టికలు
- తూతూమంత్రంగా తనిఖీలు
- నిలువునా మోసపోతున్న రైతన్నలు



**ప్రజాపక్షం/పినపాక:** మండల వ్యాప్తంగా ఉన్న ఎరువులు, పురుగు మందుల దుకాణాలు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా..? అనే అనుమానాలు రేకెత్తుకున్నాయి. కాలం చెల్లిన పురుగు మందులు, ఎరువులు యథేచ్ఛగా అమ్మకాలు జరపడం పరిపాటిగా మారింది. ప్రభుత్వం నిషేధించిన గ్లైపోసెట్ దుకాణాల యజమానులు రైతులకు అంటగడుతున్నారు. మరి కొన్ని దుకాణాల్లో రైతులకు ఖాతాలు పెట్టి అమాయక రైతన్న లను మోసగిస్తూ ఇష్టారాజ్యంగా పురుగు మందులకు రేట్లు వేస్తున్నారు. అడిగేవారు.. అడ్డుకునే వారు లేకపోవడంతో ఎరువుల, పురుగు మందుల దుకాణాల యజమానులు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా కొనసాగుతోంది. నిత్యం తనిఖీలు చేయాల్సిన వ్యవసాయ శాఖ, విజిలెన్స్, టాస్క్ ఫోర్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో వ్యాపారులు రెచ్చిపోతూ రైతన్నలను నిలువు దోపిడీ చేస్తున్నారని విమర్శలు వినవస్తున్నాయి. అంతే కాకుండా డిమాండ్ ఉన్న పురుగు మందులకు అధిక ధరలతో విక్రయాలు చేపడుతూ రైతు నెత్తిన కుచ్చుటోపి పెడుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. మిర్చి పంటకు తెగులు వచ్చే దశలో రైతన్నలు ఆయా షాపులకు వెళితే అడ్డగోలు అధిక ధరలు నిర్ణయించి అమ్ముతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన రైతులకు పురుగు మందులు ఇవ్వకుండా తిరిగి వెనక్కి పంపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణంలో దిగుమతి అయిన వివిధ రకాల ఎరువులు పురుగుమందుల స్టాక్ పరిస్థితిని, ధరలను ఎప్పటికప్పుడు రిజిస్టర్లో నమోదు చేసి బోర్డులపై డిస్ప్లే చేయాల్సి ఉంటుంది. దాంతోపాటు స్టాక్ నిల్వ ఉంచే గోదాములకు ప్రభుత్వ అనుమతులు తీసుకొని గోదాములలో ఎన్ని రకాల పురుగు మందులు ఎరువులు ఉంచామన్నది అధికారులకు సమాచారం అందించాల్సి ఉంటుంది.కానీ ఇవేవీ ఇక్కడ అమలు కావడం లేదు. దీంతో రైతన్నల అమాయకత్వాన్ని, అవసరాలను ఆసరాగా చేసుకున్న ఎరువులు, పురుగు మందుల వ్యాపారులు కాలం చెల్లిన ఎరువులను పురుగుమందులను అంటగడుతూ రైతన్నలకు తీరని అన్యాయం చేస్తున్నారు. కాలం చెల్లిన ఎరువులు పురుగు మందులు ఉపయోగించడంతో రైతన్నలకు సరైన దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయి ఫాలో అవుతున్నామని రైతన్నలు ఆందోళన వ్యక్తులు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో షాపులపై ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహించి అక్రమాలను నిరోధించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సీజన్‌కో రకంగా వ్యాపారులు అందించే అమ్యామ్యాలకు ఆశపడిన అధికారులు అప్పుడప్పుడు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి ప్రకటనలు, ఫోటోలకు ఫోజులిస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని కష్ట నష్టాలకు ఓర్చి వ్యవసాయం చేస్తే ఘట్టెక్కుతామన్న నమ్మకం లేదని రైతన్నలు బోరున విలపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన ఎరువులు, పురుగు మందులు అరికట్టి అధిక ధరలను నిరోధించాలని పలువురు రైతన్నలు వేడుకుంటున్నారు.

## ఆకాశంలో మబ్బులు.. రైతన్న గుండెల్లో గుబులు..!



**ప్రజాపక్షం/సుజాతనగర్:** గత రెండు రోజుల నుండి ఆకాశంలో మబ్బులతో వాతావరణం చల్లబడి, అక్కడక్కడ తేలికపాటి వర్షం కురవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం సుజాతనగర్ మండలంలో ఆకాశమంత మబ్బులతో కమ్ముకున్నాయి. ఈ ప్రాంతమంతా రైతు కుటుంబాలు కావడంతో యాసంగి పంటలలో సాగు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రధాన పంటలైన వరి 783 ఎకరాలు, మొక్కజొన్న 247, జొన్నలు 750, నువ్వులు 53 ఎకరాలలో పంట సాగు అవుతుంది. వాటితో పాటు కూరగాయల పంటలను కూడా సాగు చేస్తున్నారు. మిర్చి రైతులు రెండవ కొత్త దశకు రైతులు ముమ్మరం చేస్తున్నారు. దీంతో చాలామంది రైతులు ఇప్పటికే మిర్చి కూలీలతో మిరపకాయలు కోత కోసి బయట కల్లాల్లో ఆరబోశారు. మొక్కజొన్న పంట చేతికి వచ్చింది. తేలికబడ్డ జల్లులు రావడంతో ఆరు కాలం కష్టపడి చేతికి అందిన పంట తడిసిపోతుంది. ఇప్పటికే రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంటలను తడవకుండా టార్ఫిన్ పట్టాలతో కాపాడుకుంటున్నారు. అకాల వర్షం రావడం ప్రతి ఏడాది పంట తడవడం రైతులను నిండా ముంచుతుంది. అధిక వడ్డీలకు లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పంటలకు సరైన గిట్టుబాటు లేక అప్పులు తీర్చలేక అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన పంటలకు కూడా సరైన గిట్టుబాటు ధర అందించి ఆదుకోవాలని రైతన్నలు వేడుకుంటున్నారు.

## భగత్‌సింగ్ జీవితం యువతకు ఆదర్శం



**ప్రజాపక్షం/ తల్లాడ :** భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మద్దాల ప్రభాకర్ అన్నారు. మంగళవారం తల్లాడ మండలం డివైఎఫ్ఐ మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి సత్తెనపల్లి నరేష్ అధ్యక్షతన జరిగింది. ముందుగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య కోసం అతి చిన్న వయస్సులోనే ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు యువతకు ఆదర్శమన్నారు. మార్చి 23న వారి వర్ధంతి సందర్భంగా వారోత్సవాలను నిర్వహించాలని అన్నారు. ఈ దేశంలో కుల, మత, పేద, ధనిక తారతమ్యాలు లేకుండా బ్రతకలాంటే సోషలిజమే మార్గమని చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతతత్వాన్ని పెంచి పోషిస్తూ పాలన కొనసాగిస్తుందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలన్నారు. భగత్‌సింగ్ ఆశయస్ఫూర్తిని డివైఎఫ్ఐ ముందుకు తీసుకెళ్తూ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల నాయకులు లక్ష్మీ నారాయణ, విక్రమ్, అన్వేష్, కిషోర్, సుధాకర్, భాస్కర్, సైదారావు, తదితరులు పాల్గొన్నారు.

# మబ్బులతో ఆకాశం మేఘావృతం

-రెండు రోజులుగా కమ్ముకున్న కారుమబ్బులు
-వర్షం వస్తే పంటలకు తీవ్ర నష్టం జరిగే అవకాశం
-ఆందోళనలో అన్నదాతలు



**ప్రజాపక్షం/పినపాక:** గత మూడు రోజుల నుండి ఒక పక్క ఎండ, మరో పక్క మేఘావృతమైన ఆకాశం పినపాక మండలంలో చోటు చేసుకున్నది. ఉదయం నుంచి ఎండ కాసింది. సాయంత్రం సమయానికి ఒక్కసారిగా ఆకాశంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం నల్ల మబ్బులు కమ్ముకుని మేఘావృతమైంది. వర్షం రాకపోయినప్పటికి ఆకాశంలో చోటుచేసుకున్న మార్పులతో ఉక్కబోతగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో ప్రజలు సేద తీరారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో అన్నదాత గుండెల్లో గుబులు మొదలైంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చిన సమయంలో అకాలవర్ష సూచనలు ఏమిటని ఆందోళన మొదలైంది. మండలంలో ప్రధానంగా మిర్చిని ఎక్కువగా పండిస్తున్నారు. చేతికి వచ్చిన మిర్చి కోతకు కూలీలతో కోస్తున్నారు. ఈ దశలో ఆకాశం మేఘావృతమై ఉండటంతో రైతన్న గుండె చెదురుతున్నది. వర్షం వస్తే చేతికొచ్చిన మిర్చి, వరి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మబ్బులు కమ్ముకురావడంతో కోతకోసిన మిర్చి పంటను రాసులుగా చేసి టార్పాలిన్ కవర్లు కప్పుకుంటున్నారు. వర్షం వస్తే పొలంలో ఉన్న వరి నేలకొరుగుతుందని, గింజలు మొలకెత్తుతాయని వాపోతున్నారు. మరోవైపు పలు గ్రామాల్లో చేలలో వరి కోతకు సిద్ధంగా ఉన్న మబ్బులతో రైతన్నలు ఆందోళనలో ఉన్నారు. వర్షం కురిస్తే వరి ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలకు కురవడంతో ఇప్పటికే మిర్చి చేనులు దెబ్బతిన్నాయి. ఎకరాకు 2030 క్వింటాళ్ల మధ్యలో దిగుబడి రావల్సిఉండగా 58 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నది. వర్షం పడితే అదికూడా చేతికిరాదని, తాలుగానే మిగులుతుంది. మళ్ళీ అసలే మార్కెట్లో రేటు లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో లాభం రాకపోయినా పెట్టుబడులైనా తిరిగివస్తాయని రైతులు ఆశతో ఉన్నారు. వర్షంరాకుండా కరుణించాలని రైతులు వరుణుడిని వేడుకుంటున్నారు.

## విజయవంతమైన ఈయు మహాసభలు

-21 తీర్మానాలను ఆమోదించిన మహాసభ
-వివరాలను వెల్లడించిన ఆహ్వాన సంఘ నాయకులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ మహాసభలు ఈనెల 16, 17 తేదీలలో ఖమ్మంలో అత్యంత విజయవంతంగా జరిగాయని ఆహ్వాన సంఘ కోశాధికారి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, ఖమ్మం రీజియన్ కార్యదర్శి పి. రమేష్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని 97 డిపోలు ఉండగా 95 డిపోల నుంచి రాష్ట్ర మహాసభకు ప్రాతినిథ్యం లభించిందని వారు తెలిపారు. మంగళవారం జరిగిన ఆహ్వాన సంఘ సమావేశం మహాసభల నిర్వహణకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా అప్పారావు, రమేష్ లు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ఆర్టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జరిగిన చర్చలో 80 మంది పాల్గొన్నారని చర్చల అనంతరం పలు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆర్టిసిని ప్రభుత్వంలో విలీనం చేస్తూ అపాయింట్‌మెంట్ డేట్ ప్రకటించాలని తీర్మానించడం జరిగిందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత ప్రయాణికుల సంఖ్య పెరగడంతో అందుకు అనుగుణంగా సిబ్బందిని, బస్సుల సంఖ్యను పెంచాలని, అన్ని విభాగాలకు సంబంధించి రిక్రూట్‌మెంట్ చేయాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. కొత్త బస్సులతో పాటు సిబ్బంది నియమాకం త్వరితగతిన జరపాలని లేకుంటే పెరిగిన ప్రయాణికుల సంఖ్య కారణంగా ఆర్టిసి కండక్టర్లు, డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మానసిక, శారీరక ఇబ్బందులతో అనారోగ్యం పాలవుతున్నారని ప్రభుత్వం సత్వరం దీనిపై చర్యలు తీసుకోవాలని తీర్మానించినట్లు అప్పారావు, రమేష్ లు తెలిపారు. ఫిట్‌మెంట్ విషయంలో, హెచ్‌ఆర్ఏ విషయంలో పునః పరిశీలన చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఎంప్లాయిస్ యూనియన్ పక్షాన వినతి పత్రం సమర్పించడం జరుగుతుందని స్పందించని పక్షంలో ఆందోళన తప్పదన్నారు. అన్నింటికి మించి ఆర్టిసి కార్మికులు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన అసోసియేషన్ల ద్వారా సమస్యల పరిష్కారానికి అవకాశం కల్పించాలని మహాసభ తీర్మానించినట్లు తెలిపారు.

**హెచ్‌ఆర్ఏ ప్రకటనకు ఈయు ఖండన...**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిసి కార్మికుల హెచ్‌ఆర్ఏ విషయంలో తప్పుదారి పట్టిస్తుందని అప్పారావు, రమేష్ లు ఆరోపించారు. జీవో నెం.53 ప్రకారం హెచ్‌ఆర్ఏను సవరించినట్లు ప్రభుత్వం చెబుతుందని కానీ 53 జీవో ప్రతిపాదన నాడు ఫిట్‌మెంట్ వ్యవహారం చర్చకు రాలేదన్నారు. 2017 వేతన సవరణ జరిగినప్పుడు హెచ్‌ఆర్ఏ విషయంలో పెరిగిన వేతనాల ప్రకారం నిర్ణయం తీసుకోకుండా ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మికులను తప్పుదారి పట్టిస్తున్నాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. సమావేశంలో ఖమ్మం డిపో కార్యదర్శి బుచ్చిబాబు, పలువురు ఆహ్వానసంఘసభ్యులు పాల్గొన్నారు.

## 108 ఈఎంటిలకు శిక్షణా తరగతులు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆర్ఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జిల్లా కేంద్రంలోని రామవరం రైతు వేదికలో ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్, ఈఎంఈ దుర్గా ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జిల్లా పరిధిలో వివిధ మండలాలలో 108లో అత్యవసర సేవలు అందిస్తున్న ఈఎంటీలకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణ కార్యక్రమంలో ఈఎంటీలకు ప్రథమ చికిత్స వైద్యం తదితర అంశాలపై గజేందర్ ప్రమోద్‌లు పూర్తి స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన పరమ ఆకాష్ ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచినందుకు గాను సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం మేనేజర్ భూమా నాగేందర్ , ఈఎంఈ దుర్గా ప్రసాద్‌లు మాట్లాడుతూ 108 సిబ్బంది అత్యవసర సేవల విభాగంలో కీలక పాత్ర వహిస్తున్నారని, వారికి ప్రతి సంవత్సరం వారం రోజులు పాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ ప్రమాదాలకు గురైన క్షతగాత్రులను వైద్యశాలకు తరలించే క్రమంలో క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిస్తూ వారిని సురక్షితంగా ప్రాణాపాయ స్థితి నుంచి ఎలా కాపాడాలో ఈ శిక్షణ తరగతులు నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మండల కేంద్రానికి చెందిన ఈఎంటి పరమ ఆకాష్‌ను అభినందించారు. ఈకార్యక్రమంలో 108 సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నన్నేసాహెబ్, కేకే ఇన్ఫ్రా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లోని ఆటోనగర్ మజీద్, ఆరెంపులలోని మజీద్‌లలో నన్నేసాహెబ్ ఛారిటబుల్ ట్రస్ట్, కేకే ఇన్ఫ్రా ఆధ్వర్యంలో మంగళవారం ఇఫ్తార్ విందును ఇచ్చారు. రంజాన్‌పవిత్ర మాసాన్ని పురస్కరించుకుని ఉపవాసదీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు అందించారు. ఈ సందర్భంగా ఆరెంపుల మజీద్ ఆధ్వర్యంలో ఖలీల్ బ్రదర్స్‌ను పూలమాలలు వేసి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిరాహకులు ఖలీల్, ఖాదర్, సభ్యులు వసీం, ఉస్మాన్, అంజతుల్లా, రహమతుల్లా, గౌస్, అక్రమ్(చోటు), రోహన్, అమానుల్లావసబ్, అదాన్, పాషా, రవి, రోహిత్ పాల్గొన్నారు.

## బాల్య వివాహంపై కలెక్టర్ ఆగ్రహం..!

-ముగ్గురిపై కేసు నమోదు
-మైనర్ బాలికను ఖమ్మం బాలల సదన్‌కు తరలింపు

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లో జరిగిన బాల్య వివాహాం ఆలస్యంగా వెలుగులోకి రావటంతో జిల్లా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలంలోని గువ్వలగూడెం కు చెందిన కృపానంధు అనే యువకుడు ముదిగొండ మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన ఓ మైనర్ బాలిక ను వివాహాం చేసుకున్న ఘటన ఆలస్యం గా వెలుగులోకి వచ్చింది. ఫిబ్రవరి లో నేలకొండపల్లి లోని ఓ చర్చి లో వివాహాం చేసుకున్నారు. కాగా ఈ విషయం పై చైల్డ్ హెల్ప్ లైన్ అధికారుల దృష్టి కి చేరింది. జిల్లా కలెక్టర్ దృష్టి కి చేరటంతో సీరియస్ అయినట్లు సమాచారం. దీంతో స్థానిక ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.నాగమణి ని విచారణ కు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో విచారించటంతో బాల్య వివాహాం జరిగినట్లు తేలింది. దీంతో స్తానిక పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పెళ్లి చేసుకున్న యువకుడు, అందుకు సహకరించిన పెళ్లి పెద్ద, చర్చి పాధర్‌లు ముగ్గురిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు నేలకొండపల్లి ఎస్సై తోట నాగరాజు తెలిపారు. మైనర్ బాలిక ను ఖమ్మం లోని బాలల సదన్ కు తరలించారు.

## విశ్వబ్రాహ్మణ సంఘానికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని వినతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని మంత్రులకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్ల హన్మాండ్లు ఆధ్వర్యంలో వినతిపత్రాలను అందచేశారు. మంగళవారం హైద్రాబాద్‌లో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా అధ్యక్షులు హన్మాండ్లు మాట్లాడుతూ 2009లో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు జివో ఇవ్వటం జరిగిందని, కాని ఇంతరవకు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయకపోవడంతో విశ్వబ్రాహ్మణులకు ఎలాంటి లాభం చూకూరలేదని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి పూర్ణచారి, ప్రధాన కార్యదర్శి దేవరకొండ రమాదేవి, సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రచారానికి ఏర్పాట్లు

**-అభ్యర్థులను ప్రకటించిన బిజేపి,కాంగ్రెస్, బిఆర్ఎస్**
**-మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మొదలైన హడావిడి**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ప్రతాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి సమాయత్తం అవుతున్నారు. పార్లమెంట్ నియోజకవర్గం గిరిజన కోటాలో ఉండటంతో ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తమ నాయకుని గెలుపుకోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇందుకోసం మూడు పార్టీల నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

**ముందే అభ్యర్థుల ప్రకటన...**

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా బిజేపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ముందే తమ అభ్యర్థులను ప్రకటించాయి. దీంతో ప్రచారాన్ని ముమ్మరం చేసి గెలుపుదిశగా పయణించాలని దిశా నిర్ధేశం చేశారు. బిజేపి పార్టీ నుండి మాజీ ఎంపి ప్రొ.అజ్మీరా సీతారాం నాయక్, కాంగ్రెస్ నుండి మాజీ ఎంపి, మాజీ కేంద్ర సహాయ మంత్రి పోరికబలరాం నాయక్, బిఆర్ఎస్ నుండి సిట్టింగ్ ఎంపి మాలోత్ కవిత పేర్లు ప్రకటించేశారు. దీంతో వారు ప్రచారానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. బిజేపి, కాంగ్రెస్‌లో జోష్ కనిపిస్తున్నప్పటికీ బిఆర్ఎస్‌లో నిరాశ నిస్పృహాలు నిండుకున్నట్లు తెలుస్తోంది.

**సమావేశాలు,బహిరంగ సభలకు ఏర్పాట్లు ...**

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సమావేశాలు, బహిరంగ సభలకు సంబంధించిన ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తోంది. బిజేపి సైతం తాజాగా చర్ల మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. బిఆర్ఎస్ అభ్యర్థి సీతారాం నాయక్ నేడు భద్రాచలం రామున్ని దర్శించుకునే ప్రచారానికి శ్రీకారం చుట్ట నున్నారు. వీటితో పాటు ఏడు నియోజకవర్గాల్లోని ప్రతీ నియోజకవర్గం పరిధిలో ఒక భారీ బహిరంగ సభ పెట్టేందుకు సన్నాహాలు సాగుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రూట్ మ్యాప్ సైతం సిద్ధం చేసింది. కాంగ్రెస్ అగ్రనేతలతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు, కర్నాట కాంగ్రెస్ నేతలు సైతం ప్రచారానికి రానున్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో వేర్వేరుగా ఒకే రోజు సభలు జరిగేలా ప్లాన్ చేస్తున్నారు. ఇక ఓటమి కుంగుబాటుతో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఇక్కడి రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలిచేందుకు ప్రయత్నిస్తోంది. ఇందు కోసం అధినేత కేసిఆర్ నేరుగా రంగంలోనికి దిగన్నట్లు తెలుస్తోంది. కేటిఆర్, హరీష్ రావుతో పాటు పలువురు ఎంఎల్ఏలు రెండు పార్లమెంట్ నియోజకవర్గాల ప్రచారానికి వస్తారని, ఇందు కోసం ఎంపి అభ్యర్థి కవితకు హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**మొదలైన హడావిడి ....**

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఎన్నికల హడావిడి రోజురోజుకీ వేడెక్కుతోంది. ఇప్పటికే అలకలపై బుజ్జగింపుల అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. స్తబ్దుగా ఉన్న నాయకులు, కార్యకర్తలను కలిసి సహకరించాలని నేతలు కోరుతున్నారు. చోటా మోటా నాయకులు సైతం తమ అభ్యర్థి గెలుపు కోసం సోషల్ మీడియాను వాడుతున్నారు. ఇక ఆయా గ్రామాల పరిధిలో ఎన్నికల హడావిడి మరో సారి మొదలైంది.

# మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

**-పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి శిరోమణి**





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్:** ప్రధాని మోడీ అవలంభిస్తున్న మతోన్మాద,ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాలని పిఓడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ శిరోమణి పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం రూరల్ మండలంలోని కాచిరాజుగూడెం గ్రామంలో మార్చి8 అంతర్జాతీయ మహిళ పోరాటా దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా మహిళలోకం బానిసబతుకులు,వెట్టిచాకిరిపై కొడవలెత్తినరోజనీ గుర్తు చేశారు. ప్రస్థుత పరిస్థితులకు నాటిరోజుల ఆవశ్యకత కనిపిస్తుందని,మహిళలోకం ధైర్యంగా ముందుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యూరాష్ట్ర కోశాధికారి టీ.ఝాన్సీలక్ష్మి , జిల్లా కార్యదర్శి ఆవుల మంగతాయి, జిల్లా సహాయ కార్యదర్శి పి.శోభ,జిల్లా నాయకురాలు బందెల లలిత, కొట్టే సత్యవతి, డివిజన్ నాయకులు కే.మమత, తోట సరోజిని, మండల నాయకులు మండల సైదమ్మ, రాంబాయి, తోకల స్వరూప, మంగమ్మ, రాజమ్మ, ధనలక్ష్మి , పుచ్చకాయల లక్ష్మి , సూరమ్మ, బి.మమత, ఉపేందర్, మనీ, నవిత, సిపిఐఎంఎల్‌మాస్‌లైన్ పాలేరుడివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య, జిల్లా నాయకులు మలీదు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు



(ఫైల్)



**రద్దీని నియంత్రించాలని ప్రజలు వినతి**

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ఎన్ఎస్పి, ప్రధాన కేంద్రమైన కల్లూరు ప్రధాన సెంటర్లో రోడ్డు ఇరు వైపులా ఉన్న చిరు దుకాణాలు వల్ల రోడ్డు రద్దీగా మారిందని దాని వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు పోలీస్ శాఖ, రెవెన్యూ, రోడ్లు, భవనాల శాఖకు మొరపెట్టుకుంటున్నారు. దీనిపై ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కల్లూరు పట్టణ మరియు పరిసర గ్రామ ప్రజలు కోరుతున్నారు. కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన నిత్యం ప్రధాన కేంద్రమైన కల్లూరు కు అనేక అవసరాల కోసం వస్తూ పోతూ ఉన్న సమయంలో రహదారి రద్దీగా మారుతున్నందున ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బంది ప్రత్యేకంగా ఉదయం సాయంత్రం సమయాలలో ప్రత్యేక సిబ్బందిని ఉంచి ట్రాఫిక్‌ను కాపాడాలని ప్రజలు పోలీస్ శాఖకు తెలియపరుస్తున్నారు. ప్రధానంగా హిమాలయ రెస్టారెంట్ నుండి ఎన్ ఎస్ పి రింగ్ రోడ్డు నిత్యం ఉదయం సాయంత్రం రద్దీగా ఉంటుంది. దుకాణాలు ఎదురుగా వాహనములు ఆపి ఉండటం వలన ఇరుకుగా ఉండి ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలవడంతో కుటుంబాలు బజారున పడుతున్నాయి దీనిపై ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, పోలీస్, శాఖ రెవెన్యూ శాఖ, ప్రత్యేక ప్రణాళికతో ప్రమాదాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు పట్టణ ప్రజలు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై కల్లూరు ఎస్ఐ ను వివరణ కోరగా సిబ్బంది కొరతతో ఇబ్బందులు పడుతున్నామని మరి కొద్ది రోజుల్లో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి నియంత్రణకు ప్రణాళికలు చేపడతామని ఎస్సై పేర్కొన్నారు.

## భద్రాచలంలో నాలుగు చెక్ పోస్టులు

**ప్రజాపక్షం/భద్రాచలం :** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భద్రాచలం పట్టణంలో నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ చెక్ పోస్టుల మీదుగా వచ్చిపోయే వాహనాలను ఆపి తనిఖీ చేస్తారు. ప్రధానంగా గోదావరి నది వంతెన వద్ద ఉన్న ఒక చెక్ పోస్టు, ఐటిడిఏ రోడ్, కూనవరం రోడ్, చర్ల రోడ్‌లో మరో మూడు చెక్‌పోస్టులు పెట్టారు.

## అక్రమ మద్యం సీజ్

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** లోక్‌సభ సాధారణ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లాలో పలు చోట్ల రూ. 42,778 విలువ చేసే అక్రమ మద్యాన్ని మంగళవారం అధికారులు సీజ్ చేశారు. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని రామన్నపేట వద్ద రూ. 19,628, దానవాయిగూడెం వద్ద రూ.18,469, గోపాలపురం వద్ద రూ.4,681 విలువ గల అక్రమ మద్యాన్ని అధికారులు పట్టుకుని సీజ్ చేశారు.

## డ్రైనేజీ పనులు పరిశీలించిన డీఈ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధిలోని వీకే రామవరం గ్రామంలో లక్ష యాభై వేల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులను పంచాయితీ రాజ్ డీఈ సత్యనారాయణ పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో తప్పని సరిగా పాటించాలని సూచించారు.

## భూ సమస్యలు పరిష్కారం చేయాలని వినతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి రెవెన్యూ గ్రామం పోలంపల్లి పంచాయతీ పరిధిలో భూ సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం జిల్లా కలెక్టర్‌కి జాయింట్ కలెక్టర్ జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు కొల్లేటి నాగేశ్వరరావు, ఝాన్సీ, గుగులోతు తేజనాయక్, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ సింగరేణి మండల నాయకులు తాటి పాపారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటల సందర్శన



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేటలోని వ్యవసాయ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంగళవారం సత్తుపల్లి మండలం సత్యనారాయణపురం గ్రామంలోని ఎస్‌కెఎస్ బినర్సరీని సందర్శించారు. క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా నర్సరీలోని వివిధ మొక్కలు, వాటిని పెంచే విధానాలు, వివిధ హైబ్రిడ్ల పై తెలుసుకున్నారు. ప్రధానంగా నర్సరీలో వక్కమొక్కలు, అరటి, జాజిపత్రి, కాశ్మీర్ ఆపిల్, మాంగోస్టీన్ విదిధ రకాల మొక్కల సాగులోని లాభాలు, సాగు విధానాలు, యాజమాన్య పద్ధతులను నర్సరీ యజమాని బాజీ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ హేమంత్, ఉద్యానవన ఆచార్యులు డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటికి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలి



**జిల్లా కలెక్టర్ విపి గౌతమ్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలో తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ తెలిపారు. మంగళవారం నూతన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపిడివో, పిఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో తాగునీటి సరఫరాపై కలెక్టర్ విపి గౌతమ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జలాశయాల్లో నీటి లభ్యత తగ్గుతున్నందున రాబోయే రోజుల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో పట్టణ ప్రాంత పరిధిలో 804 బోర్లు, 151 పంపులు పనిచేస్తున్నట్లు, గ్రామీణ ప్రాంత పరిధిలో 1627 బోర్లు, 7199 పంపులు అందుబాటులో ఉన్నాయన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ముందు ఏఏ ప్రాంతాల్లో ఎంత మేర నీటి లభ్యత ఉంటుందో ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టాల్సిన చర్యలపై కార్యాచరణ చేయాలన్నారు. బోర్ల మరమ్మతులు, ఫ్లషింగ్‌లు చేయాలని, ప్రైవేటు బావులు, నీటి వనరులు లీజుకు తీసుకోనుట చేయాలన్నారు. నీటి వనరులు ఉన్న గ్రామాల్లో సరిపోను ఉన్నది లేనిది చూడాలన్నారు. తాగునీటి సరఫరా విషయమై మంజూరు పనులు యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. బోర్‌వెల్ ఆపరేటర్లు అనుమతి లేకుండా ప్రైవేటు బోర్లు వేస్తే వాల్టా చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. కొత్త బోర్ల మంజూరు విషయమై నియమ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. గతేడాది నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న గ్రామాలలో సమస్య పునరావృతం కాకుండా చూడాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మిషన్ భగీరథ ఏఇలు క్షేత్రస్థాయిలో గ్రామాలు తిరిగి తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలు ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలన్నారు. తాగునీటి ఎద్దడి కలుగకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్ మయాంక్ సింగ్, మిషన్ భగీరథ ఎస్ఈ సదాశివకుమార్, పిఆర్ ఎస్ఈ చంద్రమౌళి, జెడ్పి సిఈవో వినోద్, డిపివో హరికిషన్, సిపివో శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఇఇ రంజిత్, మిషన్ భగీరథ ఇఇలు పుష్పలత, వాణిశ్రీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ సమస్యలపై విచారణ కమిటీ ఏర్పాటు చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీ సమస్యలపై జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా మంగళవారం విచార కమిటీని ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీలోని హాస్టల్లో మౌళిక సదుపాయాలు లేవని, ఆహారం నాణ్యతగా లేదని, తాగునీరు శుభ్రంగా అందించటం లేదని, మెస్ చార్జీలు వసూళ్లు చేస్తున్నారని, క్రమశిక్షణ నెపంతో రాత్రి వేళల్లో హాస్టల్ క్యాంపస్‌లోకి వచ్చి వీడియోలు రికార్డు చేస్తూ బెదిరిస్తున్నారని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననివ్వడం లేదని సోమవారం మెడికల్ కాలేజీ ముందు విద్యార్థులు ధర్నా చేయడంతో కలెక్టర్ స్పందించారు. జెడ్పి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్ ప్రసూన రాణి అధ్యక్షతన కమిటీ ఉంటుందని, కమిటీలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ యు శ్రీనివాసరావు, ఉద్యానవన అధికారి కే సూర్యనారాయణ సభ్యులుగా ఉంటారని చెప్పారు. ఆరోపణలపై కమిటి పూర్తిస్థాయి విచారణ జరిపి 22వ తేది సాయంత్రం 5 గం.లోపు నివేదిక అందజేస్తారని కలెక్టర్ చెప్పారు.

# రూ. 10వేల విలువ చేసే గంజాయి స్వాధీనం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 10వేల విలువ గల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఖమ్మం నగర ఏసిపి రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో టూటౌన్ పోలీసులు ఖమ్మం రాపర్తి నగర్ ఏరియా రైల్వే అండర్ బ్రిడ్జి కింద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా దానవాయిగూడెంకు చెందిన శీలం రవి, పెంద్ర వరుణ్, బుర్హాన్‌పురంకు చెందిన ఇగావే శ్రావణ్, మేకలబండ పార్కు 2కు చెందిన దోతుల సాయి గా గుర్తించారు. వీరిలో రవి, వరుణ్ కూలీ పనులు చేస్తుండగా శ్రావణ్ వెడ్డింగ్ ఈవెంట్, సాయి విద్యనభ్యసిస్తున్నాడు. వీరంతా గత కొంత కాలంగా గంజాయి సేవించడం, విక్రయించడానికి అలవాటుపడ్డారని తెలిపారు. ఈ క్రమంలో శీలం రవి, పెంద్ర వరుణ్ లు వారం రోజుల క్రితం భద్రాచలం అవతల సీలేరుకు వెళ్లి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద అర కేజీ గంజాయిని తీసుకు వచ్చారు. వారి వద్ద మిగిలిన గంజాయిని పొట్లాలు కట్టి విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా పట్టుబట్టారు. వారి వద్ద నుంచి రూ. 10వేల విలువ గల ఎండు గంజాయిని, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనపర్చుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసిపి తెలిపారు.

# ఎన్నికల నిబంధనలు పాటించని ఎక్సైజ్‌శాఖ

**-బెల్ట్‌షాపుల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు**
**- నామమాత్రపుదాడులు నిర్వహిస్తున్న ఎక్సైజ్‌శాఖ**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు ఎన్నికల నిబంధనలు పాటించకుండా నామమాత్రపు దాడులు చేసి మద్యం వ్యాపారులకు సహకిరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల తేదీని ప్రకటించినప్పటి నుండి ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చాయి. అధికారులు పూర్తిగా ఎన్నికల నిబంధనలు పాటిస్తూ అక్రమ మద్యం నగదు ఎక్కువ మొత్తంలో వస్తువులు తరలిస్తున్న వాహనాలు చెక్‌పోస్ట్‌ల వద్ద పోలీసులు తనిఖీ నిర్వహిస్తున్నారు. కానీ మండలంలోని అన్ని గ్రామాల్లో విచ్చవిడిగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు మాత్రం మద్యం వ్యాపారులతో కుమ్మక్కై నామమాత్రపు దాడులు నిర్వహిస్తూ పరోక్షంగా వారికి సహకరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని మొత్తం ఐదువైన్‌షాపులు లాటరీ పద్ధతిలో మద్యం వ్యాపారులు పొందగా వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి ఎక్కువ ధరకు బెల్ట్ షాపులకు మద్యాన్ని విక్రయిస్తూ లక్షల రూపాయల ప్రజాధనాన్ని దండుకుంటున్నారు. కనీసం ఎన్నికల నిబంధనలు పాటించకుండా గ్రామాల్లో బెల్ట్‌షాపులు వైన్‌షాపులను తలపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ బెల్ట్‌షాపులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

# ఎమ్మెల్యే పలకరింపులు, పరామర్శలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో ఉన్న కుటుంబాలను మంగళవారం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి పరామర్శించారు. కార్యక్రమంలో భాగంగా శ్రీరాంపురంలో అనారోగ్యంతో మరణించిన మారబోయిన గోపి ఎన్‌ఎస్పీలో కేసర చెన్నారెడ్డి కుమారుడు మరణించగా వారి కుటుంబాన్ని కల్లూరు లోని నీలం సుమంత్ నాయుడు మరణించగా వారి కుటుంబాన్ని కల్లూరు గోపాలకుంట కాలనీలో మంజుల నాగరాజు అనారోగ్యంతో బాధపడుతుండగా వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతిని తెలిపారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని కుటుంబాలను ఓదార్చి ధైర్యాన్ని తెలిపారు. ధైర్యంగా ఉండాలని కుటుంబాలకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పసుమర్తి , బొప్పన శ్రీనాథ్, ఏనుగు సత్యంబాబు, పుల్లారావు, ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పోలీస్ కవాతు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని చెన్నూరు,పెద్ద కోరుకొండి , చిన్న కోరుకొండి, కప్పల బంధం తదితర గ్రామాలలో మంగళవారం పోలీస్ శాఖ ఎస్సై ఆధ్వర్యంలో పోలీస్ కవాతు నిర్వహించారు. గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఓటును స్వేచ్ఛగా స్వచ్ఛందంగా వినియోగించుకునేందుకు గ్రామాలలో వివాదాలు గొడవలు జరగకుండా, తమ ఓటును స్వచ్ఛందంగా స్వేచ్ఛగా ధైర్యంగా వినియోగించుకోవాలని కోరుతూ ఎన్నికల సమయంలో ఎలాంటి ఇబ్బందులు సమస్యలు ఎదురైతే వెంటనే పోలీస్ శాఖకు సమాచారాన్ని అందించాలని గ్రామాల్లో ఈ కవాతు ద్వారా ప్రజలకు తెలియ పరుస్తున్నామని ఎస్సై షేక్ షాకీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర బలగాలైన సిఐఎస్ఎఫ్ వారితో పోలీస్ కవాతు మండల పరిధిలోని సమస్యాత్మకగ్రామాలతో పాటు మారుమూల ప్రాంతాలలో పోలీస్ కవాతును నిర్వహిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

# పూటకో పార్టీ మారేవారికి నో ఎంట్రీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కాంగ్రెస్ పార్టీ అవినీతి రహిత సమాజాన్ని కోరుతుందని, అందుకే ఏ కళంకం లేని వ్యక్తులను పార్టీలోకి ఆహ్వానించడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు కొన్ని సంవత్సరాలుగా పార్టీ విధేయులుగా ఉండి కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సహకరించిన నాయకుల సలహాలు, సూచనలు స్వీకరిస్తూ ఐక్యతతో పనిచేసే వాళ్ళకి కాంగ్రెస్‌పార్టీ ఎప్పుడు గేట్లు తెరిచి ఉంచుతుందన్నారు. ఇతర పార్టీల నుండి కాంగ్రెస్‌లోకి వచ్చే వ్యక్తులు మండల కాంగ్రెస్ ముఖ్యనేతల సలహాలు పరిగణనలోకి తీసుకొని పార్టీలోకి ఆహ్వానిస్తే బాగుంటుందని తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ఇటీవల పలు సందర్భాల్లో మాట్లాడుతూ ఆయా మండలాల స్థానిక అభిప్రాయాలకు అనుగుణంగా చేరికలు ఉంటాయని పేర్కొన్న విషయం విధితమే. కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లో అమలులోకి తెచ్చిన ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి, అర్హులకు ఎవరికైనా గ్రామాల్లో వర్తించకుంటే ఆయా గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎంపిడివో కార్యాలయానికి లబ్దిదారరులను తీసుకొని వచ్చి ఆ పథకాలు వర్తింపజేసేలా పాటుపడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు తలారి చంద్రప్రకాష్, ఎస్టీ సెల్ అధ్యక్షులు గోపాల్‌నాయక్, మైనారిటీ సెల్ అధ్యక్షులు తాజుద్దీన్, ఎస్సీ సెల్ అధ్యక్షులు మేదరి టోని, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, జిల్లా ఎస్టీ సెల్ నాయకులు భీముడు నాయక్, జిల్లా నాయకులు ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు వినోద్‌నాయక్, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు హర్షనాయక్, మైనారిటీ సెల్ జిల్లా నాయకులు షబ్బీర్, మైనారిటీ సెల్ నియోజకవర్గ నాయకులు పేరు, సీనియర్ నాయకులు సురేందర్ మనియార్, సట్టు వీరభద్రం, సముద్రాల వీరన్న, పాటి నర్సయ్య, బోడా సేట్రం, చాంద్‌పాషా, హచు, ఈరు, భావ్‌సింగ్, వినోద్, హేమ్లానాయక్, వీరన్న, మల్లేష్ యాదవ్, తొగర శ్రీను, గమిడి నర్సింహారావు, శ్యామ్, కళ్యాణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌కు తిప్పన సిద్దులు రాజీనామా



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం బిఆర్ఎస్ పార్టీకి ఆ పార్టీ సీనియర్ నాయకులు తిప్పన సిద్దులు మంగళవారం రాజీనామా చేశారు. ప్రొఫెసర్ కోదండరామ్ సమక్ష్యంలో టిజేఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా తిప్పన సిద్దులకు టిజేఎస్ జెండాను ఆపార్టీ అధినేత కొదండరామ్ కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు.